# అత్యంత సన్నిహితులు

వారంరోజులుగా రాళ్లు పేల్చినఎండ తగ్గుముఖం పట్టింది. రాత్రి కుండపోతగా కురిసినవర్షం తగ్గింది కానీ ఇంకా తుంపరలు పూర్తిగా వదల్లేదు.

ఆస్పత్రిలో బెడ్‌మీద పడుకుని సుమిత్ర కిటికీలోనుండి చూస్తూ ఆలోచిస్తోంది. మామూలుగా అయితే నాలుగున్నర మైళ్లు నడిచేసును ఇలాటి సమయాల్లోయ కాలికి కట్టూ, మెళ్లో పెట్టెడా, పక్కటెముకల్లో పోట్లూ ప్రస్తుతం కదల్నియ్యడంలేదు. ఏమాత్రం కదిలినా ప్రాణం జివ్వున లాగేస్తోంది. ఒళ్లంతా పచ్చిపుండు. అలాగే నెమ్మదిగా రవంత ఓపిక తెచ్చుకుని పక్కకి తిరిగి కిటికీలోంచి చూస్తోంది.

సుమిత్ర అమెరికా వచ్చి ఏడాదిన్నర అయింది. పోస్టుడాకుగా వచ్చింది, రాగానే వాళ్ల ప్రఫెసరుకారికమీద మరో పోస్టుడాకు ఆవిడకి ఇళ్లు చూపించడానికి బయల్దేరేడు కారు తీసుకుని. మొదట యూనివర్సిటీకి దగ్గరయితే బాగుండుననుకుంది కానీ ఇక్కడ "సూడెంటుబాబుల"గదులు రెండు చూసేసరికి కడుపులో దేవినట్టయింది. అమెరికాలాటి గొప్పదేశంలో ఇళ్లు ఇంత ఛండాలంగా వుండగలవని ఎవరేనా చెప్తే కుళ్లుబుద్ధితో చెప్తున్నారేమో అనుకుని వుండును. కానీ తాను కళ్లారా చూసి, కళ్లు తిరిగి, వదండి అంటూ గబగబా అక్కడినించి వచ్చేసింది ఇల్లు చూపించినఅమెరికను అబ్బాయిచెయ్యి పుచ్చుకు లాగుతూ.

యూనివర్సిటీకి దగ్గర అంతబాగుండదని తెలిసినతరవాత కొంచెం దూరంలో మరో ఎపార్టుమెంటు చూపించేడతను. అది బాగానే వుంది. పైగా బస్సు గుమ్మంముందు ఆగుతుంది. అంచేత కారుండితీరాలన్నబాధ లేదు. పైగా కారున్నా యూనివర్సిటీదగ్గర పార్కింగు ఎలాగా ప్రోబ్లమే కనక ఇదే ఇంకా బాగుందనిపించింది. ఇవన్నీ అతనే సుమిత్రకి బోధించి ఆవాటా కుదిర్చిపెట్టేశాడు.

ఆసాయంత్రమే కూరా, నారా తెచ్చుకుందాం అని బజారుకి బయల్దేరింది. బస్సెక్కబోతూంటే పొరుగువాటాలో వున్నాయన కనిపించి, హలో చెప్పి, తనపేరు చెప్పుకుని, "కాస్త దూరం అయినా వూళ్లో వుద్మన్సులో కూరలు తాజాగానూ చవగ్గానూ వుంటాయి" అని చెప్పేడు. ఆయనకీ కారు లేదు. తాను బస్సులో వెళ్లి, టాక్సీలో వస్తానని చెప్పి, కావలిస్తే, టాక్సీ షేరు చేసుకుందాం అని కూడా సుళువు చెప్పేడు.

సుమిత్రకి అది బాగానే వుందనిపించింది. అలా అమెరికాజీవితంలో సుళువులు గ్రహించుకుంటూ కొంతకాలం గడుపుకొచ్చింది.

అచిరకాలంలోనే అది సుఖదాయకం, శాంతిదాయకం కాకుండా పోయింది. పొరుగాయన "ఇదుగో ఈపక్కనే" "ఒక్కనిముషం", "మరొక్క వస్తువు" .. అంటూ కూరలషాపులోనించి మరోషాపుకీ, మరోపనికీ తిరగడం, ఇద్దరికీ అనుకూలమయినసమయాలు కుదరకపోవడటం - ఇలా ఏవేవో కారణాలు కనిపించి ఆఏర్పాటుకి అవాంతరం ఏర్పడింది.

సుమిత్రకి కారు కొనుక్కోవలసినఅగత్యం తెలిసొచ్చింది. ఆవిడెవరో రాసిన విదేశీయాత్రలో అమెరికాలో కారులు కారుచౌక అని చదివింది. అయిదువందలు పారేస్తే బంగారంలాటి కారొస్తుంది, అమెరికాలో కారులేనివారిని కానం అని చాలామంది చెప్పేరు. అఫ్ కోర్స్, కారులేనివారు అమెరికాలో వుందురు అని సుమిత్రకి త్వరగానే తెలిసిపోయింది. అదుగో, అప్పుడే శ్యామల పరిచయం అయింది ఓసాయంత్రం షికారుకి వెళ్లినప్పుడుయ ఆవిడ తనపిల్లలిద్దరినీ, పొరుగింటిపిల్లాడినీ తీసుకుని పార్కుకి వెళ్తోంది. "అట్లా దౌడు తీయకురా,"

తేటతెలుగుమాట వినిపించి, సుమిత్ర ఉలిక్కిపడి అటువేపు తిరిగి చూసింది. సుమిత్ర తనవేపు చూడడం శ్యామల చూసింది. ఇద్దరు చిరునవ్వులు నవ్వేరు. సుమిత్ర ఉక్కిరబిక్కిరి అయిపోతూ, "మీరు కూడా తెలుగువాళ్లేనా?" అంది. అమెరికాకి వచ్చినకొత్తలో అలాగే వుంటుంది చాలామందికి. చెలుగు వినిపిస్తే ఉలికిపడతారు. ప్రాణం లెచొస్తుంది.

అలా అయినపరిచయం అనతికాలంలోనే స్నేహమయి మాధవీలతలా అల్లుకుపోయింది.

అట్టిసమయంలోనే సుమిత్ర ఓకారు కొనుక్కుంటే పోదూ అనుకుంటోంది. శ్యామల స్వయంగా కారు నడపదు. వాళ్లకి కూడా కారు లేదు. ఎప్పుడేనా కొనుక్కోకతప్పదు కదా అని కారులమీద రిసెర్చి చేసి పెట్టుకుందావిడ. బర్త సురేష్ ఆఫీసుకెళ్లిపోయేక, పెద్దపిల్లాడిని స్కూల్లో దిగవిడిచి వచ్చి, చిన్నదాన్ని నిద్ర పుచ్చి, కంప్యూటరుమీదా, పేపర్లలోనూ చూసి బోలెడు సమాచారం సేకరించింది.

శ్యామల సుమిత్రకి చెప్పిందేమిటంటే, అయిదువందలకి వచ్చేకార్లు మనం నడిపేలా వుండవు. మనం నడవలేం వాటిని. మనకి నమ్మినబంటు హనుమంతుని వంటి వాహనం కావాలి. కంటికి నదురుగా కాకపోయినా చూసినక్షణమే అదిరిపడేలా వుండరాదు. మైలేజి తక్కువుండాలి. మైళ్లు ఎక్కువ ఇవ్వాలి.

ఆతరవాత ఓ వారాంతం శ్యామలే మళ్లీ పిలిచింది. "పద. వూరికినే చూద్దువుగానీ. చూడగానే కొనేయాలనేం లేదు కదా."

సరేనంది సుమిత్ర, కాలక్షేపంగానూ వుంటుంది, ఎద్యుకేషనుగానూ వుంటుందని.

రెండువారాంతాలు అలా చూసినతరవాత ఓకారు చూసి ముచ్చట పడిపోయింది. మరింక దాన్ని వదల్లేకపోయింది. సుమిత్ర కారు కొనడం అయిపోయింది. కారు కొన్నతరవాత సుమిత్రే శ్యామలని పిలుస్తూ వచ్చింది బజారుకో సినిమాకో పార్టీకో వెళ్లినప్పుడల్లా.

అయితే కాలం ఎప్పుడూ ఒక్కలాగే సాగదు అని నిరూపించడానికేనేమో శ్యామలావాళ్లు ఇల్లు మారేరు. అది ఊరికి ఉత్తరంగా ఆరుమైళ్లు దూరం వెళ్లిపోయేరు. మంచి ఎపార్టుమెంటు ఎక్కవ వసతులతో తక్కువ అద్దెకి దొరికిందని.

సుమిత్రకి కారుంది కనక తనే తరుచూ శ్యామలావాళ్లింటికి వెళ్లడ ఆనవాయితీ అయిపోయింది. ఆవిషయంలో సుమిత్రకి ఏం బాధలేకపోయింది.

ఆవిడ రెండోసారి వెళ్లినప్పుడు శ్యామల అంది, "అన్నీ బాగానే వున్నాయి కానీ బజారు చేసుకోడమే ఇబ్బంది అవుతోంది. మరీ దూరం అయిపోయింది."

సుమిత్రకి నిజమే అనిపించింది, "ఎలాగా వచ్చేను కదా. పద. కనీసం ఈవా?రం కావలసినవి తీసుకొచ్చేసుకుందువు గానీ

శ్యామల ఒప్పుకోలేదు. "బజారు దాదాపు మీయింటిదగ్గర. అక్కడ్నుంచి ఇక్కడికొచ్చి, మళ్లీ అంతదూరం వెళ్లి, మళ్లీ ఇక్కడికొచ్చి నన్ను దింపి మీయింటికి ... నీకారు మాటెలా వున్నా రోడ్డు అరిగిపోతుంది,"అంది నవ్వుతూ.

కాని సుమిత్ర ఒప్పుకోలేదు, "ఫరవాలేదులే. పాలవాడుకలా వారం వారం హాజరవుతాననడం లేదు. వచ్చినప్పుడు చేస్తాను. నేను రానప్పుడు టాక్సీ ఎలాగా తప్పదు." ఆవిధంగా రాతకోతలు లేని ఓ ఒప్పందం కుదిరిపోయింది వాళ్లిద్దరిమధ్య.

కాని శ్యామలకి ఇబ్బందిగానే వుంటోంది. అవునూ కాదూ ఫరవాలేదు అంటూ జరువుకొన్తున్నారు. బజారుకో పేరంటానికో సుమిత్ర తనని తీసుకెళ్లినప్పుడల్లా గాస్ మనీ అయినా తీసుకోమని అడుగుతూనే వుంది. ఈదేశంలో అది మామూలే. అందులో తప్పులేదు అని కూడా చెప్తోంది. ఆఖరికి శ్యామలని సంతోషపెట్టడానికి సుమిత్ర ఒకటి రెండుసార్లు పుచ్చుకుంది.

రెండోసారి రోజులెప్పుడూ ఒక్కలాగే వుండవు అనుకోడానికి ఆస్కారంగల మరోచిన్న వ్యథ సంభవించింది.

ఊరిపొలిమేరల్లో కొత్తగా ఇల్లు కట్టుకున్న రాధాస్వామినాయుటడుగారిభార్య సీతాలక్ష్మిగారు ఊళ్లో ఉన్న తెలుగువారినందరినీ పిలిచారు గృహప్రవేశానికీ, సత్యనారాయవ్రతానికీను. సుమిత్రని పిలిచి, ఆమాటా ఈమాటా మాటాడి "మీరు శ్యామలగారిని పిలుచుకురాగలరా?" అని అడిగారు.

"అలాగేనండీ. దానిదేముంది," అంది సుమిత్ర.

రోడికి ఊరుకుని, మర్నాడు శ్యామలని పిలిచి, "సీతాలక్ష్మిగారింటికి వస్తున్నావా?" అనడిగి, అయిదుగంటలకి వస్తాను అని చెప్పింది. సాయంత్రం ట్రాఫిక్ ఎక్కువగా వుంటుంది, ఈచివరినుండి ఆచివరికి వెళ్లాలి కదా అని.

అలాగే అంది శ్యామల. అనుకున్నట్టుగానే సుమిత్ర వచ్చింది. శ్యామలా, పిల్లలూ కారెక్కారు,

సీతాలక్ష్మిగారింట్లో హలోలు సాగుతుండగా, ఒకావిడ "కాంతిమతిగారు వచ్చినట్టు లేదే" అన్నారు.

"లేదు. ఆవిడ డ్రైవు చేయరు. వాళ్లాయన ఊర్లో లేరంట"

"మీరెలా వచ్చారు?మీరు కూడా డ్రైవు చెయ్యరనుకుంటానే," అనడిగింది శ్యామలని ఆవిడే.

"సుమిత్రతో వచ్చేను,"అంది శ్యామల ఇబ్బంది పడుతున్నట్టు కనిపించకుండా జాగ్రత్త పడుతూ.

"మంచామెనే మీకు దోస్తు దొరికింది. నేనయితే అసలు పోడమే మానుకుంటా" అని అక్కడితో వదిలిపెట్టకుండా, సుమిత్రవేపు మెచ్చుకోలుగా చూసి, "మీకు నిండా ధైర్యం. హైరోడ్డుమీన కూడా డ్రైవు చేస్తురు. నేనయితే మా?ల్లా, పిల్లగాండ్లస్కూలూ, షాపింగా ... అంతే. ఆపైన ఏడకి పోవాలన్నా రెడ్డిగారే," అంది.

మళ్లీ శ్యామలతో, "మీరెప్పుడూ మాయింటికి రానేలేదు. పైవారం రండి. సుమిత్రగారూ, మీరునూ రండిమీ. ఆమెను తోడుకొని," అంది.

శ్యామలకి ఏంచెప్పాలో తోచలేదు. తెల్లబోయి చూస్తూ ఊరుకొంది. సుమిత్ర, "అలాగేలెండి." అనేసి, అక్కడినించి లేచి, కిటికీదగ్గరికి వెళ్లి చూస్తూ, "మీమందారచెట్టు బాగా పూస్తోందండీ," అంది సీతాలక్ష్మిగారితో.

"ఈరోజు ఎండ బాగుందని బయట పెట్టాను. కాస్త చల్లబడితే మళ్ల ఇంట్లోకి తెచ్చేయాలి. నాకేమో మొక్కలంటే ప్రాణం. అసలందుకే పెద్దపెరడున్న ఇల్లు తీసుకున్నాం," అన్నరు మరెవరో.

చర్చ మలుపు తిరిగినందుకు సిత్రా, శఅయామలా కూడా హమ్మయ్య అనుకున్నారు స్వగతంలో.

ఆరోదు కారులో శ్యామల ముభావంగా వుండిపోయింది. సుమిత్రకి మాటాడాలని వుంది కానీ ఏంమాటాడ్డానికీ తోచలేదు.

శ్యామలని వాళ్లింట్లో దింపి, "రేపు పిలుస్తాను" అని చెప్పి ఇంటికి వచ్చేసింది. కానీ వాళ్లిద్దరిమనసుల్లోనూ వాళ్లూ వీళ్లూ చేసిన అనవసరప్రసంగంతాలూకు ఛాయలు సన్నగా పరుచుకుంటున్నాయి. అసురసంధ్యవేళ చీకట్లు కమ్ముకున్నట్టు. ఆవిడేం అనుకుంటోందో అని ఈవిడా, ఈవిడేం అనుకుంటోందో అని ఆవిడా మధనపడసాగేరు. వాళ్లమధ్య మాటలు పూర్తిగా ఆగిపోకపోయినా, ఇదమిత్థం అని నిర్వచించలేని తెరల్లేచేయి. సుమిత్ర ఎమర్జెన్సీరూంలో మంచంమీద పడుకుని వుంది. తను ఇక్కడ ఎందుకుందో, చుట్టూ వున్నవారెవరో, వాళ్లేం అడుగుతున్నారో స్పష్టంగా తలకెక్కడంలేదు.

ఏవో పరీక్షలు, .. ఏవో ప్రశ్నలు ... మీవాళ్లెవరేనా ఇక్కున్నారా? ... మీకు అత్యంతసన్నిహితులెవరు? ... మీ next of kin పేరో ఫోన్నెంబరో చెప్పండి ...

ఇంతలో గుమ్మందగ్గర అలికిడి అయి అటువేపు తిరగబోయింది. మెడకున్న పట్టెడ కలుక్కుమంది. ... జివ్వున లాగుతున్ననొప్పి. ...

"కదలకు," ఎవరో హెచ్చరించేరు.

శ్యామల నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటూ వచ్చి పక్కన నిలబడి, "ఎలా వుంది?" అనడిగింది.

"బాగానే వుంది," అంది సుమిత్ర నీరసంగా.

కాస్సేపు ఇద్దరూ మాటాడలేదు. శ్యామల పక్కనున్ననర్సువేపు తిరిగి వివరాలు అడిగింది.

ఆ నర్సు "డాక్టరుతో మాటాడండి," అంది శ్యామల సుతారంగా సుమిత్రచేతిమీద చెయ్యేసి, "రెస్టు తీసుకో. నేను డాక్టరుతో మాటాడివస్తాను," అని చెప్పి వెళ్లిపోయింది.

సుమిత్ర సరేనన్నట్టు కనురెప్పలాడించింది. పావుగంటతరవాత శ్యామల తిరిగొచ్చి, "ఫరవాలేదన్నారు. ఈరాత్రికి ఇక్కడ వుండనివ్వండి. రేపు ఇంటికి తీసుకుపోవచ్చు అంటున్నారు" అని చెప్పింది.

మర్నాడు శ్యామల వచ్చింది పన్నెండుగంటలకి. "డాక్టరు ఇంటికి పోవచ్చన్నారు. నాలుగురోజులపాటు బెడ్‌రెస్టు వుంటే మంచిదన్నారు," అంటూ క్లాజట్‌లోంచి బట్టలు తీసి అందించింది సుమిత్రకి.

రిలీజుకాగితాలమీద సంతకాలూ, గట్రా అయేక, సుమిత్ర, మామూలుగా అందరు పేషంట్లలాగే నాకు చక్రాలబండి అక్కర్లేదు అని నసపెట్టి, వాళ్లచేత "హాస్పిటల్ రూల్స్" అని చెప్పించుకుని, కూర్చుంది.

బయటికి వచ్చేక, "నువ్వు ఇక్కడుండు. కారు తీసుకొస్తాను," అని శ్యామల వెళ్లి పదినిముషాల్లో కారు తెచ్చింది. సంచీ ట్రంకులో పడేసి, కారు తలుపు తీసి, సుమిత్రకి చెయ్యందించింది.

సుమిత్ర కారులో కూర్చుని, నిన్నటినించీ తనని వేధిస్తున్న ప్రశ్న, తాను అడగాలనుకున్న ప్రశ్న అడిగేసింది మరి ఉండబట్టలేక, "నీకెలా తెలిసింది?"

"వాళ్లరికార్డుల్లో నీ next of kin ఎవరు అన్నచోట నాపేరుందిట. అంచేత నన్ను పిలిచి చెప్పేరు.

కారు శ్యామలయింటిముందు ఆగింది.

సుమిత్ర సంకోచిస్తూ, "నీకెందుకూ శ్రమ. మాయింటిదగ్గర దింపు," అంది.

"ఒక్కదానివీ ఎలా వుంటావు. కాస్త తేరుకునేవరకూ ఇక్కడే వుండు. తరవాత వెళ్దువుగాని ఇంటికి" అంది శ్యామల నిష్కల్మషంగా.

ఇద్దరిమనసులూ తేలిక పడ్డాయి. సుమిత్ర కారు దిగుతుంటే, "ఆంటీ" అంటూ పిల్లలు వచ్చి ఒక్కవుదుటన మీద పడబోయారు. సురేష్ వాళ్లని పట్టుకుని, ఆపి, "రండి, జాగ్రత్త" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించేడు.

(సిలికానాంధ్ర వార్షిక సంచిక, 2007లో ప్రచురితం.)